# వెన్నెల

ఉత్తరం చదివి బల్లమీద పడేశాను "... ... రేపురాత్రి బయలుదేరి వస్తున్నాను."

నీ ప్రియమైన మరదలు,
రుక్మిణి."

ఈ వాక్యాలు మాత్రమే సరిగ్గా గమనించగలిగాను. ఒక్కసారిగా ఏడేళ్ళచరిత్ర కళ్లకు కట్టినట్లయింది....

* * *

కమలతో నా పెళ్లి కథలోలాగ జరిగి పోయింది. మేళతాళాలు, బంధువుల హడావుడి, పిల్లల సంబరం—ఇవన్నీ మూడు రోజుల్ని, అన్ని క్షణాలుగామార్చేశాయి. మమ్మల్నిద్దర్నీ దీవిస్తున్నప్పుడు మా మామయ్య, అత్తయ్యల ముఖాలలోని ఆనందాన్నీ, సంతృప్తినీ చూడగలిగిన నా కళ్లు చెమర్చాయి. మా అమ్మ నాకు బుద్ధి తెలియకముందే మరణించింది; నాన్న నాలుగు సంవత్సరాలు నిండకముందే గతించాడు. నన్ను పెంచి పెద్దచేసి నా ఆస్తి, వ్యవహారాలను చూసి పెట్టిన మామయ్యా, అత్తయ్యా వీరిద్దరే నాకు తలిదండ్రులవంటి వారయ్యారు. వారి కూతుళ్ల చదువు సమస్యగా మిగిలిపోయినప్పుడు నేనే కలుగజేసుకున్నాను. పెద్దది కమల. స్కూల్‌ఫైనల్ పాసయ్యి ఇంటిదగ్గరే ఉంది. కమల చెల్లెలు రుక్మిణిని కూడా చదువు మాన్పించివేస్తానంటే నేనే పట్టుపట్టి కాలేజీలో చేర్పించాను. ఎంత వాదించినా అత్తయ్యా, మామయ్యా ఇద్దరూకూడా నేను చేసిన ఈ పనికి హర్షించారని నాకు బాగా తెలుసు.....

కమలను పెళ్లిచేసుకుంటానని చెప్పినప్పుడు మామయ్య ఏమంటాడో అని భయపడ్డాను. కాని ఆయన సంతోషానికి అంతులేదు. వెంటనే ముహూర్తం పెట్టించేశాడు. పెళ్లికి కావల్సిన ఏర్పాట్లన్నీ అత్తయ్య స్వయంగా చేయించింది. పెళ్లి ఇంకా పదిరోజు లుండనగానే నన్ను గుంటూరునుంచి రప్పించి విడిది ఏర్పాటు చేయించింది. కళ్లముందు పుట్టి పెరిగిన వాడికీ మర్యాదలన్నీ ఏమిటని నేను అడ్డుపెట్టినా, పెళ్లి పెళ్లేనని నా అభ్యంతరాలన్నిటినీ తోసేసింది. ఈ తతంగాలలో మళ్లా పెళ్లివరకూ కమలను సరిగా చూడలేకపోయాను. "నన్ను చేసుకోడం నీ కిష్టమేనా కమలా?" అని నేనడిగినప్పుడు ఆమె నావరించిన సిగ్గు నన్నుముగ్ధుణ్ణి చేసింది. మా ఇద్దరిమధ్యా అంతవరకూఉన్న చనువు మాయమయిపోయింది. సరే నన్నట్లుగా తల ఊపినతర్వాత నేనుకూడా మాట్లాడలేకపోయాను... ...

వెన్నెలలో డాబామీద కొబ్బరిచెట్లనీడలు స్పష్టంగా పడుతున్నాయి. వచ్చినబంధువులు చాలామంది వెళ్లిపోయారు. ఇల్లు చాలామట్టుకు సద్దుమణిగి ఉంది. దూరాన పూరిదీపాలు కొన్ని మిణుగురుమంటున్నాయి. తీయగా ఎదురుచూస్తున్న నేను గాజులశబ్దం విన్నాను. కమల మెల్లిగా అడుగులు వేస్తూ, నా దగ్గరకువచ్చి ఆగిపోయింది.

"కమలా!" అన్నాను నేనే చివరకు.

"ఊ!" అని వంచిన తల పైకెత్తి చూసింది. వెన్నెలలో ఆమెకళ్ళు మెరిశాయి.

"మనం అదృష్టవంతులం......" తడబడే గొంతుకతో అన్నాను. కమల చిరునవ్వు నవ్వింది. సిగ్గుతో బుగ్గల్ని రెండుచేతులతో కప్పేసుకుంది

"మాట్లాడవేం?" అని అడిగాను.

"మీరు... ..." అని ఏదో చెప్పబోయింది. నేను

## గోవిందరాజు శ్యామసుందర్

కమల మాటల కడ్డువస్తూ, "ఎప్పుడూలేని ఈ బహువచనప్రయోగం ఇప్పు డెక్కడ్నుంచి వచ్చింది? పెళ్లయినా నేనింకా నీ బావనే" అన్నాను.

"సరే బావా! అలాగే పిలుస్తాలెండి......పిలుస్తాలే!" వెన్నెలలో మా నవ్వు ఆకుల గలగలలో కలిసిపోయింది... ...

* * *

రైల్లో వెడుతూ ఉండగా మెల్లిగా అన్నది, "బావోయ్! ఇంతవరకూ ఇష్టంవచ్చినప్పుడు హోటలుగడ్డి తిని దున్నపోతులా పడి ఉండేవాడివి! ఇంక ఇటువంటిదేదీ కుదరదు తెల్సా?" ఇంత మెల్లిగా చెప్పినా ఇది మాతో ప్రయాణం చేస్తున్నాయనకు వినబడి ఆయన చిరునవ్వుతో మా వైపు చూశాడు. నేనుకూడా ఆయనకు వినబడేట్టే మెల్లిగా, "నీకు పుణ్యముంటుంది! వూరికెళ్లిన తర్వాత కొత్తచీపురుకొనిస్తా. అంతవరకూ నావరువు తీయక! ఎవరన్నా వినపోతారు!" ఇంకేముంది, కమలకు కళ్ళవెంబడి నీళ్లు తిరిగాయి. గంటసేపు వేడుకునేవరకూ మూతి ముడుచుకు కూర్చుంది......

* * *

గుంటూరు స్టేషనుకి కిశోరు, ఆచారితో సహా, ఇంచుమించు నాస్నేహితులందరూ వచ్చారు. పెళ్లికి రాలేకపోయినవారు కొందరు నన్నుడికించడానికి వినబడీ వినబడనట్లుగా "నీకంటే మీ ఆవిడే బావుం"దని, ఇందులో పెద్ద ఆశ్చర్యపడవల్సిన దేమున్న"దని, "మనవాడి అందం మనకి తెలీదుట్రా!" అనీ పరిపరివిధాలుగా అన్నారు. కమల ఎంత కాదన్నా గడుసరికాబట్టి, ఈ పరిహాసాలకి చలించకుండా మృదువైన సెలోక్తులతో మమ్మల్నందర్నీ నవ్వులలో ముంచేసింది... ...

మా ఇల్లు, మా స్నేహితుల భార్యలకు కూడా ఒక కేంద్రమయిపోయింది. కమల వీణ వాయిస్తే వినటానికనీ, కుట్టుపని తెలుసుకోటానికనీ ఎప్పుడూ ఎవరో వచ్చిపోతూ ఉండేవారు. కమల ఇట్టే అందరికీ సన్నిహితురాలైపోయింది.

మా సంసారంలో రెండేళ్ళు రెండు క్షణాలలా గడిచిపోయాయి. 'అంబి' పుట్టాడు. మా జీవితంలోని కొక క్రొత్త వెలుగు ప్రవేశించింది. అత్తయ్యా మామయ్యల ఆనందానికి అంతులేదు. వీలైనప్పుడల్లా వచ్చి వెడుతూ ఉండేవారు. అంబి రుక్మిణిని చూస్తే వదిలిపెట్టేవాడు కాదు. రుక్మిణికి అంబి అంటే ప్రాణం.

"పిల్లలంటే ఇంత ఇష్టపడే దానివి పెళ్లెందుకు చేసుకోకూడ"దని కమల రుక్మిణిని ఏడిపిస్తూ ఉండేది. రుక్మిణి దీనికి నవ్వి, "చూస్తూ ఉండు, వీడు నా దగ్గరే పెరుగుతాడు! ఏరా అంబీ?" అని బుగ్గ గిల్లేది......


* * *

రుక్మిణి ఇంటరుపరీక్షలు జరిగిన కొద్దిరోజులకే మా కొక ఘోరమైన విపత్తు సంభవించింది. ఆ ఊరిలో విజృంభించిన మశూచికం తగిలి మా అత్తయ్య మామయ్య లిద్దరూ ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయారు. చిన్నదైనా రుక్మిణే మమ్మల్ని ఓదార్చి ధైర్యం చెప్పవలసివచ్చింది. తన తల్లిదండ్రుల మరణం రుక్మిణితో డాక్టరవాలన్న నిశ్చయాన్ని దృఢపరిచింది. నేనూ కమలా తప్ప దగ్గరవాళ్లెవరూ లేకపోవటంవల్ల రుక్మిణి చదువు భారమంతా నామీద పడింది. మెడికల్ కాలేజీలో చేర్పించాను....

* * *

అంబికి నాలుగో ఏడవగా లక్ష్మి పుట్టింది. ఆడపిల్ల కావాలనుకున్న కమల సంతోష మింతా అంతా కాదు.

"పిన్నీ నాకు చెల్లాయి పుట్టింది!" అంబి గంతులువేశాడు. పాపాయి నెత్తుకున్న రుక్మిణితో, "అంబిగాడ్ని ముద్దుచేసి నెత్తికెక్కించుకున్నావు. దీన్నికూడా అలాగే తయారుచేసేట్టున్నావు!" అన్నది కమల నవ్వుతూ.



# ఉచిత

నిన్ను నీవే దేవుని యెదుట యోగ్యునిగా కనబరచుకొనుటకు

# పఠించుము

గృహవిద్యాపఠనము, తెలుగు, ఇంగ్లీషు, మళయాళము, హిందీ లేక మరాఠీ భాషలలో తెప్పించుకొనుము.

హోమ్ స్టడీ డివిజను
పోస్టు బాక్సు 36
బెంగుళూరు -1



**LEUCODERMA**
(శ్వేతకుష్ఠు)

వలన యెంతమాత్రం భయపడనక్కర లేదు. మావద్దగల ప్రఖ్యాతి ఆయుర్వేద ఔషధములు సులభముగా, నమ్మకంగా తెల్ల, ఎఱ్ఱ మచ్చలు ఎంత పాతవైన, శరీరంలో యేభాగమునందున్నా పోగొట్టును. వేనవేలు మా సుంగుణ విజయమునుగూర్చి ప్రశంసిస్తున్నారు. పైపూత, లోనికి మందు పీసా 1 టికి

రూ. 20/- మాత్రమే.

Vaidyaraj Ramsharan Lalgupta
(A) PO. Rajdhanwar (H.Bagh)


# వెన్నెల

"నీ పిల్లలు చెడిపోతారని అంతభయమైతే నేనసలెత్తుకోనే ఎత్తుకోను!" రుక్మిణి నవ్వుతూనే పాపనింకా దగ్గరగా హత్తుకుంది......

*　　*　　*

రుక్మిణీ అంబీ ఇద్దరూ అస్తమానం పాపాయి నాడిస్తూ ఉండేవారు.

"దాన్నే ఎప్పుడూ ఎత్తుకు కూర్చుంటే నీ చదువు సాగినట్టే!" అని కమల చివాట్లు వేస్తూ ఉండేది. రుక్మిణి లెక్కచేసేది కాదు. నిజానికి రుక్మిణి అన్ని పరీక్షలలోనూ మంచిమార్కులే తెచ్చుకునేది. అది కమల కెక్కువ సంతోషం కలిగించినా, "చూడు బావా ఇది మరీ గడుగ్గాయయిపోతోంది!" అని రుక్మిణిని ఏడిపించడానికని కమల నాతో ఫిర్యాదుచేసేది.

"నీకు తగ్గచెల్లెలేగా !" నేను నవ్వి పూరుకునేవాడిని......

*　　*　　*

పాపకి రెండేళ్ళు నిండేయి. వచ్చీరాని మాటలతో అందరినీ ఆనందపరిచేది. కమలకు కొన్ని రోజులుగా జ్వరం వస్తూ, తగ్గుతూ ఉండడంవల్ల పిల్లల బాధ్యత రుక్మిణికి కొంచె మధికమయింది. జ్వరం తగిలినప్పుడు "మందుచీటీ రాసిస్తా. పుచ్చుకో" అనేది రుక్మిణి.

"నీ డాక్టరీ విజ్ఞానం నామీద ప్రయోగించకు బాబూ!" కమల ఉడికించేది. రుక్మిణికి చిరుకోపం వచ్చినా అంతకంటే ఎక్కువ శ్రద్ధతో మందు లిప్పించేది. ఈ జ్వరాలు మాటిమాటికి ౨౦౦౫రా చేత కమల బాగా నీరసించిపోయింది. చాలామంది డాక్టర్లకు చూపించాముకాని వారంతా జబ్బేమీ లేదనీ, కేవలం బలహీనతేననీ అన్నారు. పని చేయడం తగ్గించమని మేమెంత చెప్పినా వినేదికాదు కమల. రుక్మిణికూడా చెప్పిచూసింది. కాని కమలు నవ్వేసి ఊరుకునేది......

*　　*　　*

రోజులు గడుస్తూనే ఉన్నాయి. రుక్మిణి డాక్టరు చదువు పూర్తిచేసి మద్రాసు ఆస్పత్రిలో ఉద్యోగం దొరికితే వెళ్లింది. వీలున్నప్పుడల్లా గుంటూరువచ్చి పిల్లల్నిచూసి వెడుతూ ఉండేది. కమల అప్పటికే రుక్మిణి పెళ్లిప్రయత్నాలు చేయవలసిందని నాతో చెబుతూ ఉండేది. నేను, ప్రత్యేకంగా చేయగలిగిందేముందని వాదించేవాడిని, కాని వీలైనంతమట్టుకు వరాన్వేషణ చేస్తూనే ఉండేవాడిని......

అప్పటికి పదిరోజులుగా కమలకి బాగా జ్వరంగా ఉన్నది. రుక్మిణికి రాస్తానంటే తనే వారించింది. ఒకనాడు మధ్యాహ్నం ఆఫీసులో ఉండగా పక్కఇంటి అబ్బాయి పరుగెత్తుకుంటూవచ్చి చెప్పాడు కమలకు చాలా ప్రమాదంగా ఉందని. ఇంటికి వెళ్ళి కమల స్థితి చూసేప్పటికి నిలువునా నీరైపోయాను. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించాను. ఏదో వాతమన్నారు. కంగారులో రుక్మిణికి టెలిగ్రామిద్దామనుకుని ఇవ్వలేకపోయాను......

*　　*　　*

ఆ రాత్రి కమల శాశ్వతంగా కన్నుమూసింది. తర్వాత ఏమిజరిగిందో కూడా తెలీలేదు. "అమ్మ ఎప్పుడు వస్తుందని" అడిగే పిల్లల ప్రశ్నలకు సమాధాన మేమిచ్చానో జ్ఞాపకంలేదు. కిశోర్ రుక్మిణికి టెలిగ్రాం పంపాడు. అందులో కమలకు 'సీరియస్'గా ఉందన్నాడేకాని నిజం చెప్పలేదు. టెలిగ్రాం పంపినరోజే రుక్మిణి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

"ప్రియమైన బావకి.

ఈమధ్య గుంటూరునుంచి వచ్చినవాళ్లెవరో అక్కయ్యకు జబ్బుగా ఉందిట అని చెప్పగా విన్నాను. అందుకనే అక్కయ్యకు వ్రాయకుండా నీకు నేరుగా వ్రాసే అవసరం కలిగింది. అంత జబ్బుగావుంటే ముందే నాకీ విషయం తెలిపి ఉండవలసింది. అంబి, లచ్చి ఎలా ఉన్నారు? నేను రేపు రాత్రి బయలుదేరి వస్తున్నాను.

నీ ప్రియమైన మరదలు,
రుక్మిణి."

ఉత్తరం చదివి బల్లమీద పడేశాను. మళ్లీ గతంలోకి వచ్చాను. ఏమీ తోచక ఉత్తరం మళ్ళీ చదివాను. మళ్లీ బల్లమీద పడేశాను.

అంబివచ్చి, "నాన్నా పక్కింటి మావ బిళ్లలు పెట్టాడు! అన్నీ నేనే తినేశా! లచ్చికి పెట్టలేదు" అని మొదలుపెట్టినవాలకం చూసికాబోలు, "నిన్న అమ్మనెక్కడికో తీసుకెళ్ళావు. ఎప్పుడొస్తుంది నాన్నా?" అని అమాయకంగా అడిగాడు.

"ఎందుకు మీరంతా ఏడుస్తున్నారు? నాక్కూడా ఏడుపొస్తోంది. బిస్కత్తు తిను. నే నొకటి తింటాను. తింటే ఏడుపురాదు. లచ్చి ఏడ్చినప్పుడు అమ్మబిస్కత్తే పెడుతుంది.నువ్వూ నేనూ తిందామా?" వాడి మాటలకి నాకు దుఃఖం పొర్లుకొచ్చింది.





Agents For Andhra : ఆక్మి ట్రేడర్స్, P. B No 116, విజయవాడ-1.

కిశోర్ భార్య సుశీలతో వచ్చిన ఇద్దరు ముగ్గు రాడవాళ్లు వాళ్ళిద్దర్నీ మరిపించి అవతలకి తీసుకుపోయారు.

* * *

రుక్మిణి ఆ రాత్రే బయలుదేరి వచ్చేసింది. నేను స్టేషనుకి వెళ్లలేదు. కిశోరే వెళ్లి రుక్మిణిని తీసుకొచ్చాడు. నన్ను చూడగానే రుక్మిణి బావురుమన్నది. పిల్లలిద్దరూ ఒక్కపెట్టున్న "పిన్నీ!" అంటూ కావలించుకున్నారు.

"కమల తనవెంటే నన్ను కూడా తీసుకెడితే బావుండేది రుక్మిణీ!" అన్నాను నేను.

"ఛా! నువ్వే ఇట్టా ఏడిస్తే ఎలా బావా!" "రుక్మిణి గద్గదమైన స్వరంతో అన్నదేకాని ఏడుపు నాపుకోలేకపోయింది. రుక్మిణిగనక లేకపోతే పిల్లల నేవిధంగా సమాధానపరచాలో నాకు తెలిసిఉండేది కాదు. తన సెలవు పొడిగించుకుని నెల రోజుల దాకా అక్కడే ఉండిపోయింది. ఎప్పుడు తిరిగి వెడతావని నే నడగలేదు.

ఒకరోజు మధ్యాహ్నం నిద్రపోయి కళ్ళు తెరిచి చూసేప్పటికి రుక్మిణి నా కాళ్ళదగ్గిరగా కూర్చుని ఉంది. ఇద్దరం ఏమీ మాట్లాడలేదు. కొంతసేపయినతర్వాత రుక్మిణి "పిల్లల సంగతేమిటి బావా" అని అడిగింది.

"ఏమో!" అన్నాను శూన్యంగా.

"అదికాదు బావా! వాళ్లని చూసేవా రెవరు? నీకు 'నా' అనేవా రెవరూ లేరుకదా నేను తప్ప ..' అర్థోక్తిలోనే ఆగిపోయింది.

నాకు రుక్మిణి ధోరణి అర్థంకాలేదు. "అయితే నన్నేం చేయమంటావు ?"

"ఇప్పుడు బావగా పిలుస్తున్నాను. అసలు బావగా చూసుకోనిమ్మంటాను" తల వంచుకుని జవాబిచ్చింది. నేనేమీ అనలేక చివాలున లేచి కూర్చున్నాను.

"అవును బావా!" నా కాళ్ళు పట్టుకుని తల నింకా దించేసింది. రుక్మిణి చేతులు తీసివేసి నేనే అడిగాను, "రుక్మిణీ! ఏమంటున్నావో తెలుసా!" అని.

"తెలిసే అంటున్నాను" అన్నది నెమ్మదిగా.

నేను లేచి కిటికీవైపుకు వెళ్లి బయటికి చూస్తూ నుంచున్నాను. నా ఆలోచనలు సుడిగుండంలో తిరుగుతున్నట్లు తిరుగుతున్నాయి. ఆవేశంతో కిటికీ ఊచల్ని పట్టుకున్నాను. ఇంతలో ఒక చిన్నపిల్లల గుంపు కేరింతలతో అరుస్తూ, ఆడుకుంటూ వీధిలోనుంచి వెళ్లారు. సందు తిరిగి మాయమైపోయేవరకూ వారివైపే చూస్తూ ఉండిపోయాను. ఆతర్వాత బరువుగా వెనక్కి తిరుగుతూ ఉండగా, మా ఎదురింటి అరుగుమీద దిగాలుగా నుంచునిఉన్న అంబి కన్పించాడు. ఎదుటనున్న బొమ్మలు వదిలి ఆ పిల్లలు వెళ్లినవైపే చూస్తూ కూర్చునిఉంది లక్ష్మి. నాలో ఏదో కదిలింది. వెనక్కి తిరిగాను. రుక్మిణి మంచం చివర కూర్చుని నేలవైపు చూస్తోంది.

"నువ్వు చెప్పినట్లే చేద్దాం, రుక్మిణీ" అన్నాను.

ఆపైసంవత్సరం మా కిద్దరికీ పెళ్లయింది. నే వద్దన్నా వినకుండా రుక్మిణి తన పనికి రాజీనామా యిచ్చింది. కనీసం గుంటూరులో ప్రాక్టీసైనా మొదలుపెట్టమని కిశోర్ చెప్పాడు. నేనేమీ మాట్లాడలేదు.

వివాహం జరిగిన రాత్రి డాబాపైన కలుసుకున్నాం. ఏమి మాట్లాడాలో తెలీక ఒక అరగంట సేపువరకూ ఇద్దరం మవునంగా ఉండిపోయాము.

"అంబి, లచ్చీ పడుకున్నారా ?" అని నేనే అడిగాను చివరకు.

"ఇప్పుడే పడుకోపెట్టి వచ్చా."

"నువ్వుకూడా వెళ్లి పడుకో."

"అవును వాళ్ల దగ్గిరే పక్క వేసుకున్నాను. ఇది చెబ్దామనే వచ్చాను."

ఎవరి గదులలోకి వాళ్లు వెళ్లిపోయాము.

రోజులు గడిచిపోతూనే ఉన్నాయి. నా ఉద్యోగంలో నేను మునిగిపోయాను. రుక్మిణి ప్రాక్టీస్ పెట్టిందన్నమాటేగాని ఎప్పుడూ అంబీ, లక్ష్మి వారిద్దరిలోనే నిమగ్నురాలై పోయింది. వాళ్లు కూడా ఎప్పుడు తమ పిన్నిని అంటిపెట్టుకుని ఉండేవారు. . . . .

ఒకనాడు లక్ష్మి నాదగ్గరకు వచ్చి "నాన్నా సుచిలత్తయ్యకు పాప పుట్టిందిట!" అని చెప్పింది వచ్చీరాని మాటలతో. నాకీ సంగతి తెలిసినా "అలాగే! నువ్వెళ్లి చూశావా ?" అని అడిగాను ఎత్తుకుని.

అప్పుడే రుక్మిణీ, అంబి లోపలికి వచ్చారు.

"ఓ! చూచా! అన్నయ్యా, పిన్నీ కూడా వత్తేరు" లచ్చి సంతోషంగా చెప్పింది.

"కిశోర్ సాయంత్రం ఇక్కడకి వస్తానన్నాడు" రుక్మిణి నాతో అన్నది.

"నాన్నా మనకికూడా పాపాయి తే బలే బావుంతుంది కదూ! ఏం నాన్నా!" అని లక్ష్మి ఉత్సాహంగా అడిగింది.

ఈ ప్రశ్నకు నేనూ, రుక్మిణీ ఇద్దరం ఉలిక్కిపడ్డాము. రుక్మిణి ఏదో మాటచెప్పి వాళ్ళిద్దర్నీ లోపలికి తీసుకెళ్లిపోయింది. లక్ష్మి ప్రశ్న నన్నెంతో కలవరపెట్టింది. ఆ తర్వాత రుక్మిణి మొహం చూడలేక బయటికి వెళ్లిపోయాను.

సాయంత్రం కిశోర్ వచ్చాడు. "అస్పత్రికి పోయి మీ అమ్మాయిని చూద్దాం పద!" అన్నాను. బయలుదేరుతూ ఉండగా లక్ష్మి లోపల్నుంచి పరుగెత్తుకుంటూ వచ్చి, "నేనూ వత్తా నాన్నా!" అన్నది.

"అబ్బ! చూశావుగదుటే! రేప్పొద్దున పిన్నితో వెడుదువుగాని" అని నేనన్నాను.

"అయితే నాకొక పాపని తెచ్చిపెట్టు!" అన్నది లక్ష్మి ఏడుపుమొహం పెట్టి.

"సరే, సరే! ఇప్పుడు ఏడుపు మొదలుపెట్టక, పుణ్యం ఉంటుంది" నా కంగారుని కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తూ లక్ష్మిని ఎత్తుకున్నాను. కిశోర్ నావైపదోకవిధంగా చూశాడు. కాని ఏమీ అనలేదు.

ఆస్పత్రినుండి తిరిగి వచ్చేప్పుడు అక్కడే ఉన్న రుక్మిణి దగ్గర వదిలి నేనూ, కిశోర్ వచ్చేశాము.

"ఏరా! ఇందా కలా కంగారుపడ్డావేమిటి ? అడగొచ్చా ?" కిశోర్ పరిహాసంగా అడిగాడు. నేను మౌనంగా ఉండటం చూసి యింకా పరిహాసంగా మాట్లాడటం మొదలుపెట్టాడు. నేనిది భరించలేక "నోర్ముయ్!" అని అరిచాను. కిశోర్ హడిలిపోయి "క్షమించు! కాని, దానికింతకోపం దేనికి ?"

> ఉపాధ్యాయుడు- రామూ, హుండీ అంటే ఏమిటిరా ?
>
> రాము-మా బామ్మ వత్తుల డబ్బా సార్.
>
> ఎనమండ్ర సూర్యనారాయణరావు (గంగవరం)

అని అడిగాడు.

"నువ్వే నన్ను క్షమించాలి కిశోర్!" బాధగా అన్నాను.

"ఒరేయ్! క్షమాపణల కేమిటిగాని, అనవసరంగా ఇంత ఆవేశం ఎందుకు ? నీ ధోరణే నా కర్థం కావడంలేదు. నీ మనస్సు బాగా లేకపోతే క్లబ్బు కెళదాం. లేదా పార్కులో కూర్చుందాం!"

పార్కుకే వెళ్లాము. కొంచెం సందేహించిన తర్వాత కిశోర్‌తో ఉన్న సంగతి చెప్పాను.

"మీరింత పిచ్చివాళ్లనుకోలేదురా!" అన్నాడు కిశోర్ అంతా విన్న తరువాత.

"అలా అనకురా, కిశోర్! రుక్మిణి నన్నెందుకు చేసుకుందో నీకు తెలీదు. కేవలం పిల్లలకోసమే. ఆమె కొకవిధంగా అన్యాయం జరిగిందని నేను గ్రహించగలుగుతున్నాను. కాని . . . "

కిశోర్ నా మాటల కడ్డువచ్చాడు. "నువ్వు గ్రహించగలిగితే అదే చాలు. నాకు తోచింది నేను చెబుతున్నానబ్బాయ్. మించిపోయిందేమీ లేదు. అంతా మీ చేతుల్లోనే ఉంది. ఇక మీ యిష్టం. ఇంటికిలే, పోదాం పద!" అని లేచి నుంచున్నాడు.

* * *

వేసవికాలమవడంచేత మంచం డాబాపైన వేసుకున్నాను. రుక్మిణీ, పిల్లలూ లోపల పడుకుంటున్నారు. భోజనం ముగించి వెన్నెలలో కొబ్బరిచెట్లవెనక చంద్రుణ్ణి చూస్తూ నుంచున్నాను. గాజులశబ్దం విని తిరిగాను. రుక్మిణి మంచినీళ్లచెంబు పెట్టి వెళ్లిపోబోతోంది.

"రుక్మిణీ!" అన్నాను. ఏమి టన్నట్లు ఆగింది. మళ్లీ "రుక్మిణీ!" అని మొదలుపెట్టానే కాని అయోమయంగా ఆగిపోయాను.

"ఏమైనా చెప్పదలుచుకున్నావా బావా ?" రుక్మిణి మెల్లిగా అడిగింది.

"రుక్మిణీ నీకు ద్రోహం చేశాను. మరెవర్నియినా పెళ్లిచేసుకొని ఉంటే నీకీ వింతదాంపత్యం ..... ఉండేదికాదు. నిన్నెలా .... క్షమాపణ కోరుకోవాలో తెలీటంలేదు." తడబడుతూ వచ్చాయి మాటలు. రుక్మిణి సమాధానమేమీ ఇవ్వకుండా చెంపకి చేతినాన్చి ఆకాశంలోకి చూస్తూ ఊరుకుంది. కొంతసేపయినతర్వాత, "బావా! నాకు లచ్చీ, అంబీ అంటే ప్రాణం. వారి తల్లిలేని లోటును తీర్చాలనే నా కోరిక. కాని నిన్ను పెళ్లి చేసుకున్నది అందుకు మాత్రమే కాదు.... " అన్నది చివరకి, నావైపు చూడకుండానే.

"రుక్మిణీ!" అని ఆమెవద్దకు వెళ్లాను కాని ఇంకేమీ అనలేకపోయాను.

వెన్నెలలో ఆకులు గాలికి గలగలమన్నాయి..... ★